## క్లుప్తంగా

### నేడు డయల్ యువర్ కమిషనర్

నెహ్రూ నగర్: డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో ఉదయం 9.30 నుంచి 10.30 వరకు ఉంటుందని చెప్పారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం కౌన్సిల్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు తీసుకుంటామని నగర కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

### దేవతామూర్తులకు బోనాలు సమర్పణ



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని రేగుమాణ్యం కాలనీకి చెందిన భక్తులు దేవతామూర్తులైన కుర్రం, ముత్యాలమ్మ, గంగమ్మ, కులదేవరకు ఆదివారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆవుల మంగమ్మ, బాలస్వామి, ప్రతాప్ నేతృత్వంలో భక్తులు బోనాలను మేళతాళాలతో ఉత్సాహంగా... ఉల్లాసంగా దేవతలకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

### కొబ్బరికాయలతో గంగమ్మ తల్లికి అలంకరణ



పిడుగురాళ్ల: పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయంలో శ్రావణ మాసం చివరి ఆదివారం కావటంతో గంగమ్మ తల్లిని కొబ్బరికాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

పిడుగురాళ్ల: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ కృష్ణుడి ప్రతిమతో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పిడుగురాళ్ల కమిటీ అధ్యక్షులు కటికం సైదారావు పాల్గొన్నారు.

### అనుమానాస్పదంగా యువకుడు మృతి



మృతుడు పీట్ల రామయ్య


రెంటచింతల: మండలంలోని గోలి గ్రామ సమీపంలోని నాగమయ్య స్వామి ఆలయం వద్ద ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాలు.. గోలి గ్రామానికి చెందిన పీట్ల రామయ్య(33)కు పదేళ్ల కిందట గురజాలకు చెందిన అంజలితో వివాహం జరిగింది. కాగా ఆమె ఐదేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో అతడు తల్లి వద్ద ఉంటున్నాడు. ఏడాది కిందట కూలీ పనుల నిమిత్తం కుటుంబ సభ్యులందరూ కలిసి గుంటూరుకు వెళ్లి జీవిస్తున్నారు. ఈ నెల 15న మృతుడు రామయ్య స్వగ్రామం గోలికి వచ్చి ఈ నెల 17 న నాగమయ్యస్వామి ఆలయం దగ్గరలో రోడ్డు పక్కన చిన్నచిన్న గాయాలతో చనిపోయి ఉండటంతో గ్రామానికి చెందిన దేవళ్ల ప్రసాద్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. తల్లి చిన్న ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోండి

నరసరావుపేట: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వల్లప్పచెరువు నీటితో నిండి ప్రమాదకరంగా తయారైందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని పట్టణ వినియోగదారుల సంఘ ఉపాధ్యక్షుడు కుంచాల స్వామి ఆదివారం కోరారు. చెరువులోని నీరు అలుగు పైగుండా రెండుమూడు అడుగుల ఎత్తున ప్రవహిస్తుందన్నారు. దీని వలన సుమారు 12 గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలుగుపై గుండా నీరు ప్రవహించటం వలన పాచిపట్టి ద్విచక్ర వాహనదారులు, పాదచారులు జారిపడుతున్నారన్నారు. గతంలో వర్షాల కారణంగా మట్టికొట్టుకుపోయి చెరువుకు గండ్లు పడ్డాయని, అవి పెద్దవై కట్టలు తెగి ఆ నీరు వలన స్టేడియం, బీసీ, సీబీ కాలనీలు మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు తక్షణమే ఆ ప్రాంతాన్ని సందర్శించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# పశుపోషణ నష్టాలపాలు

- పెరిగిన దాన ధరలు
- గిట్టుబాటు కాని పాల ధరలు
- కొండెక్కిన ఎండిగడ్డి ధర



తుమ్మకోట గ్రామ శివార్లో పశుగ్రాసం మేస్తున్న గేదెలు

రెంటచింతల: రైతులు పశుపోషణకు దూరమవుతున్నారు. వరి గడ్డి కొరత.. పెరిగిన ధరలు.. పాల ధర గిట్టుబాటు కాకపోవడం వంటి సమస్యలు పోషకులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గతంలో ఎండుగడ్డి, వర్షకాలంలో పచ్చిగడ్డి గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉండేది. యాంత్రీకరణ నేపథ్యంలో గడ్డి సమస్యగా మారింది.

**పోషణభారమై..**

గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పశుపోషణ కూడా చేపట్టారు. అదీ వ్యవసాయానికి గర్వంగా భావించేవారు. రానురాను వ్యవసాయ పద్ధతులలో మార్పు రావడంతో పశుపోషణకు ఆసక్తి చూపడం లేదు. మండలంలో సుమారు 18 వేలకు పైగా గేదెలు పదేళ్ల కిందట ఉండగా ప్రస్తుతం 12 వేలు మాత్రమే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కొద్ది కాలం క్రితం 30 వేల నుంచి 35 వేల వరకు ధర పెట్టి ఓ మోస్తారు పాడి గేదెను కొనుగోలు చేస్తే మూడు లీటర్ల పాలను ఇచ్చేది. ప్రస్తుతం 45 వేల నుంచి 50 వేల రూపాయలు చెల్లించిన 4 లీటర్లకు మించి పాలు ఇస్తున్న దాఖలాలు లేవని పలువురు పశు పోషకులు వాపోతున్నారు.

**మండుతున్న ఎండుగడ్డి ధర...**

గ్రామాల్లో ఎండుగడ్డి ధర రూ.12, 500 నుంచి రూ.13 వేల వరకు పెరిగింది. దాణా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ ఏడాది కొద్ది రోజుల వరకు సరైన వర్షాలు పడకపోవడంతో పొలాల్లో పశుగ్రాసం లేక, ఇంటి దగ్గర ఎండుగడ్డి అయిపోవడంతో ఎకరం పచ్చిగ్రాసం(జున్నుగడ్డి) కొనుగోలు చేసినట్లు పశుపోషకులు తెలిపారు. వ్యాధులకు అదనంగా ఖర్చు అవుతున్నట్లు పేర్కొంటున్నారు. మండలంలోని పాలువాయిగేటు, తుమ్మకోట, మంచికల్లు, రెంటాల రెంటచింతల తదితర గ్రామాల్లో ఇప్పటికి కూడా పశువులపై ఆధారపడి కుటుంబాలను పోషించు కుంటున్నవారు పెద్దసంఖ్యలో ఉన్నారు.

### రాయితీపై పశు దాణా ఇవ్వాలి



ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వం పాడి రైతులకు రాయితీపై పశువుల దాణాను సరఫరా చేసి ఆదుకోవాలి. పాల కేంద్రాలలో లీటర్ పాలకు రూ.38 నుంచి రూ.40 కొనుగోలు చేస్తున్నారు. ధర గిట్టుబాటు కావడం లేదు. ఒక గేదెకు నెలకు సుమారు రూ.5 వేలు ఖర్చు అవుతోంది. ఎండు గడ్డి, దాన ధరలు పెరగడం కారణంగా పశుపోషణ భారంగా మారింది.

–గుంటా లక్ష్మమ్మ, పశుపోషకురాలు, పాలువాయి

### ఆకాశాన్ని అంటిన ఎండుగడ్డి ధర



ఎండ గడ్డి ధర ట్రక్ రూ.13 వేలకు ఆకాశాన్ని అంటడంతో ఎకరం పచ్చిగడ్డి(జున్నుగడ్డి) రూ.50 వేల చొప్పున కొనుగోలు చేశాం. ఎన్నో ఎళ్లగా మా కుటుంబం పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నాం. మాకు 11 పాడి గేదెలున్నాయి. మూడు నెలలుగా పశువైద్యాధికారి లేకపోవడంతో పశువులకు వ్యాధులు వచ్చిన బహిరంగ మార్కెట్‌లో మందులు కొనుగోలు చేస్తున్నాం.

–షేక్ నాసర్‌బీ, పశు పోషకురాలు, రెంటచింతల

### ప్రభుత్వమే పాడి రైతులను ఆదుకోవాలి



ప్రభుత్వమే పాడి రైతులకు రాయితీపై పశుగ్రాసం, దాణా అందజేయడంతో పాటు పశువైద్యశాలలో ఉచితంగా మందులను అందించాలి. 50 కేజీ తవుడు ధర రూ.1350 కాగా త్రిబుల్ కే దాణా ధర రూ.3200 ఉంది. ఒక ట్రక్ ఎండుగడ్డి(100 కట్టలు) రూ.13 వేలు పలుకుతుండగా పాడి రైతులకు గిట్టుబాటు కావడం లేదు. పాల కేంద్రంలో ధర గిట్టుబాటు కావడం లేదు. ఇంటింటికి వెళ్లి పాలు పోసుకొని జీవిస్తున్నాం.

–ఎస్‌కే బాలసైదా, పశు పోషకుడు, రెంటచింతల

## విద్యతోనే సూర్య బలిజల అభివృద్ధి సాధ్యం

**నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు**



విద్యార్థులకు స్కాలర్ షిప్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే, విద్యా సంఘం అధ్యక్షుడు రఘురాం

లక్ష్మీపురం: సూర్య బలిజలు స్వాతంత్ర్యం అనంతరం కూడా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అనేక వివక్షతలకు గురవుతున్నారని, విద్యతోనే అధిగమించవచ్చని నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో సూర్య బలిజ విద్యా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు, ఇతర విద్యా ఉపకరణాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి విద్యా సంఘం అధ్యక్షుడు చదలవాడ రఘురాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 16 సంవత్సరాలుగా పేద విద్యార్థులను గుర్తించి వారి విద్యాభివృద్ధికి చేయూతనందిస్తున్న సూర్య బలిజ సేవా సంఘం సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు, పుస్తకాలు పంపిణీ చేశారు. విద్య సంఘం అధ్యక్షులు చదలవాడ రఘురాం, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ దాసరి కృష్ణారావు మాట్లాడుతూ సూర్య బలిజ సంఘం పేద విద్యార్థులకు చేస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. బీసీ పేద విద్యార్థులకు సంఘం తరఫున ఎల్లప్పుడు అన్ని విధాల సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో విద్యాసంఘం కార్యదర్శి మద్దెల కైలాసనాథ్ బాబు, కోశాధికారి సిద్దాబత్తుని విజయకుమార్, అల్లు భాస్కరరావు, మద్దుల రాము, చిత్తజల్లు నాగ రాము, మద్దుల వీరభద్రరావు, జక్కుల వెంకట రమణమూర్తి, తీగల దుర్గాప్రసాద్, జిల్లా విద్యా సంఘం నాయకులు, పూల మహేష్, చదలవాడ సుధాకర్, ధరణికోట మోహన్ రావు పాల్గొన్నారు.

## కోదండ రామాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



నూతన కమిటీ సభ్యులు

నాదెండ్ల: గణపవరంలో కొలువైయున్న శ్రీ కోదండ రామాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి దర్శి అనిల్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజల అనంతరం గోత్రనామ పూజలు నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా కాటా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా జంపని వెంకటరత్నం, ఉపాధ్యక్షుడిగా గుర్రం ఆదినారాయణ, కోశాధికారిగా గాలి బుచ్చయ్య, జాయింట్ సెక్రటరీగా నార్నె శివయ్య ప్రమాణస్వీకారం చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఉన్న మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు కాటా రత్తయ్యలు నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కండువాలు కప్పి ప్రసాదాలు అందించారు. మరో 14 మంది సభ్యులుగా కొనసాగనున్నారు. వీరి కాలపరిమితి ప్రతి రెండేళ్లకోసారి శ్రావణ మాసం వరకు కొనసాగుతుందన్నారు.

# 'స్వామిత్వ' పునఃప్రారంభం



యడ్లపాడులో స్వామిత్వ కింద సర్వే నిర్వహిస్తున్న అధికారులు

యడ్లపాడు: గ్రామీణ ప్రాంత నివాస గృహాలు, ఖాళీ స్థలాలపై గుర్తింపు ప్రక్రియ స్వామిత్వ కార్యక్రమం మండలంలో మళ్లీ మొదలైంది. కేంద్రం రూపొందించిన ఈ పథకం 2020న అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ప్రారంభమైంది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుల కింద ఎంపిక చేసిన గ్రామాలతో పాటు యడ్లపాడు మండలంలోని మర్రిపాలెం, దింతెనపాడు గ్రామాల్లో స్వామిత్వ సర్వే ప్రక్రియ విజయవంతం అయింది. అప్పట్లో సర్వే పూర్తయిన ఈ రెండు గ్రామాల్లోని ప్రజలకు ఆస్తి ధ్రువపత్రాలను పంపిణీ చేయడం జరిగింది. అయితే మండలంలో మిగిలిన 10 రెవెన్యూ గ్రామాల్లో తిరిగి సర్వే పనుల్ని అధికారులు ప్రారంభించారు. గతంలోనే గ్రామాల్లో గ్రామ కంఠాల సరిహద్దులను గుర్తించడం పూర్తికావడంతో ఆయా గ్రామాల్లోని 13,600 ఇళ్లు, ఖాళీ స్థలాల సర్వే నిర్వహించనున్నారు. ఈ ఏడాది అక్టోబర్ చివరి నాటికి స్వామిత్వ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా చేసుకున్నారని ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. సర్వే ప్రక్రియ ముగించాక ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలపై గ్రామ సభలు ఏర్పాటు చేస్తామన్నారు. వారి సమస్యల పరిష్కారం అనంతరం వారి ఆస్తులకు చట్టబద్ధత కలిగిన ధ్రువ పత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సర్వే నిమిత్తం గ్రామాల్లోని ఇళ్లకు వచ్చిన సర్వేబృందాలకు క్షేత్రస్థాయిలో సమగ్ర సమాచారం అందించి ప్రజలు సహకరించాలని కోరారు.

## వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రాజుపాలెం: మండల కేంద్రమైన రాజుపాలెంలో వేంచేసి ఉన్న పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం మూడవ రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించారు. కల్యాణ మహోత్సవంలో 20 జంటలు పాల్గొన్నాయి. వివిధ పుష్పాలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కల్యాణ మహోత్సవంలో దేవస్థాన వ్యవస్థాపకులు, బాలాజీ ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకట రమసుబ్బారావు దంపతులు పాల్గొని కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వార్లను రథంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కట్టవారిపాలెం మహిళల కోలాటం గ్రామస్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం రాత్రి శ్రీకృష్ణ రాయబారం పద్య నాటకం నిర్వహించగా చూపరులను ఆకట్టుకుంది.

### జనసేవాదళ్ శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీలో అంతర్భాగమైన జనసేవాదళ్ కార్యకర్తల శిక్షణ శిబిరం నిర్వహించినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాదు తెలిపారు. శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు రక్షణ కవచంలా వారిని ఆదుకునేందుకు సేవాదళ్ కార్యకర్తలు పనిచేస్తారని తెలిపారు. ఈనెల 23వ తేదీ నుంచి ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలలో సేవాదళ్ కార్యకర్తలు ప్రజా ప్రదర్శనలో అగ్రభాగాన రెడ్ షర్ట్స్ వలంటీర్స్ ఫాస్ట్ మార్చ్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బారావు, సిహెచ్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

### వినాయక చవితి సంబరాలు ప్రారంభం



నాదెండ్ల: గ్రామాల్లో వినాయక చవితి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయాలు, చలువ పందిళ్లలో గణపతిని ప్రతిష్ఠించనున్నారు. మేజర్ పంచాయతీ గణపవరంలో సుమారు 20–25 విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ఆదివారం గణపవరం గ్రామంలోని సినిమా హాల్ వీధిలో ఓ భారీ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై తీసుకొచ్చి ప్రతిష్ఠించేందుకు యువత ఏర్పాట్లు చేశారు. 3–7 రోజుల వరకూ ప్రత్యేక పూజలు, నిమజ్జనం నిర్వహించనున్నారు.

### యోగాతో పరిపూర్ణ జీవనం

నరసరావుపేట ఈస్ట్: యోగాభ్యాసం ద్వారా పరిపూర్ణమైన జీవనాన్ని అనుభవించవచ్చని శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం (మంగళగిరి) ప్రధాన ఆచార్యుడు ఆతుకూరి వేంకటేశ్వర యోగి గురూజీ తెలిపారు. యోగా సేవా కేంద్రం నరసరావుపేట రూరల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 7వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు, కేంద్రం 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వేంకటేశ్వర గురూజీ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అభ్యాసకులతో మాట్లాడుతూ, నిత్యం యోగను సాధన చేయాలని సూచించారు.రూరల్ శాఖ నిర్వాహకుడు జల్లి శ్రీనివాసరావు, చిలకలూరిపేట యోగా గురువులు కావుగంటి శివప్రసాదరావు, కనమర్లపూడి శారద, సహాయ గురువులు బండి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రామాలయ పునర్నిర్మాణానికి సహకరిస్తాం

**విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు**



అచ్చంపేట: మండలంలోని కోగంటివారిపాలెంలో రామాలయ పునర్నిర్మాణానికి తమ వంతు సహకారం ఉంటుందని పల్నాడు జిల్లా విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు రవికుమార్, మట్టుపల్లి సుబ్బారాయుడు తెలిపారు. మండల ప్రముఖ్ తుమ్మా మర్రెడ్డి ఆధ్వర్యంలో కోగంటివారిపాలెంలో ఆదివారం సాయంత్రం రామాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలో రామాలయం జీర్ణోద్ధరణకు గురయ్యే అవకాశం ఉన్నందున పునర్నిర్మాణానికి నిధులు సమకూర్చమని గ్రామస్తులు కోరగా వారు వెంటనే స్పందించారు. రామాలయ పునర్నిర్మాణంలో హిందూ పరిషత్ భాగస్వామి అవుతుందని స్పష్టం చేశారు. అనంతరం గోరక్షా గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరం

**మాజీ ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి**



రోగులను పరిశీలిస్తున్న వైద్యులు

పిడుగురాళ్ల రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపీపీ అల్లు సత్యవతి పిచ్చిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తుమ్మలచెరువులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాటూరి మెడికల్ కాలేజీ హాస్పిటల్ సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. 300 మందికి కంటి పరీక్షలు చేశారు. సత్యవతి పిచ్చిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని పేద వారికి ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలని ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో కాటూరి మెడికల్ కాలేజీ కార్డియాలజీ డాక్టర్ శ్రీసనా, జనరల్ మెడిసిన్ డాక్టర్ దీపిక, ఆర్థోపెడిక్స్ డాక్టర్ అఖిల్ ఏ, కంటి వైద్యులు అసిక, ఈఎన్‌టీ డాక్టర్ అమీనా, డెర్మటాలజీ డాక్టర్ విద్యాధర్, జనరల్ సర్జరీ డాక్టర్ పునీత, పెల్మోనాలజీ డాక్టర్ విద్యాలహరి, గైనకాలజీ డాక్టర్ హారిక, మార్కెటింగ్ మేనేజర్ రాంబాబు, బి.డి.ఓ రామకృష్ణ, పీఆర్వోలు శ్రీనాథ్, పురుషోత్తం పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ




సీనియర్ జర్నలిస్టులు నాగేశ్వరరావు, ఖాశింలను సన్మానిస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల: పట్టణంలోని సాయి వృద్ధాశ్రయంలో ఆదివారం ఏపీయూడబ్ల్యూజే కమిటీ సభ్యులు పండ్లను పంపిణీ చేశారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గుత్తా పేరయ్య, కార్యదర్శి షేక్ రంజాన్‌వలి, జిల్లా కమిటీ సభ్యులు గుదే నరసింహారావు, కొమ్ము మహేష్, వి.సైదాచారి, ధీకొండ రామారావు, పఠాన్ సైదా, షేక్ కరిముల్లా, మహేష్‌రెడ్డి, అంజనేయులు, ఆరీఫ్, బాబూరావు పాల్గొన్నారు.

**సీనియర్ జర్నలిస్ట్‌లకు సన్మానం**

మాచర్ల రూరల్: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) యూనియన్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం పట్టణంలో రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద యూనియన్ జెండాను మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, బీసీ నాయకులు బృంగా రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు ఎంఎస్ నాగేశ్వరరావు, ఖాశింలను సన్మానించారు. అనంతరం సూర్య కిరణ్ మానసిక వికలాంగుల పాఠశాలలో అన్నదానం చేశారు. సంఘం నాయకులు గాడిపర్తి శ్రీనివాసరావు, మాగులూరి రాంబాబు, నరసరాజు, బాలబోయిన పాపారావు, శ్రీనివాసరెడ్డి, ఓరుగంటి చెన్నకేశవరావు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలపై స్పందన



● మహనీయులకు ఇచ్చే గౌరవం ఇదేనా!

బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం అనేక మంది ప్రాణత్యాగం చేశారు. అలాంటి మహనీయుల విగ్రహాలను ఏర్పాటుచేసుకుని ప్రతి ఏటా వారిని స్మరించుకుంటాం. ఆ మహనీయులకు తీరని అవమానం జరిగింది. పిడుగురాళ్లలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల(జమునా స్కూల్) ఆవరణలో జాతిపిత మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, పొట్టి శ్రీరాములు, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలను ఏర్పాటుచేశారు. మూడేళ్ల కిందట పాఠశాల పునఃనిర్మాణం చేపట్టారు. విగ్రహాలను తీసి పక్కన పెట్టారు. విగ్రహాలను పునఃప్రతిష్ఠ చేయలేదు. – పిడుగురాళ్ల

చెట్ల పొదల్లో ఉన్న జాతీయ నాయకుల విగ్రహాలు

ఇటీవల సాక్షిలో వచ్చిన కథనం

సాక్షి ఎఫెక్ట్

పిడుగురాళ్ల: మహనీయులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని శీర్షికను ఆగస్టు 15 తేదీన సాక్షి కథనానికి పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ విద్యాశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. పట్టణంలోని ప్రాథమిక పాఠశాల(జమునా స్కూల్) ప్రాంగణంలో మూడేళ్ల క్రితం జాతిపిత మహాత్మ గాంధి, నేతాజీ సుభాష్ చంద్రబోష్, పొట్టి శ్రీరాములు, లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాలు తొలగించి ఖాళీ స్థలంలో పడవేశారు. అయితే పాఠశాల పునఃనిర్మాణం పూర్తయి ఏడాది దాటినప్పటికి మహనీయుల విగ్రహాలను పట్టించుకునే నాథుడే లేకపోవడంతో సాక్షిలో మహనీయులను పట్టించుకునేవారు లేరా అని శీర్షికను ప్రచురించిన సంగతి పాఠకులకువిధితమే. జిల్లా విద్యాశాఖ అధికారిణి చంద్రకళ స్పందించి పిడుగురాళ్ల ఎంఈఓ శ్రీనివాసరెడ్డికి ఆదేశాలు జారీ చేయడంతో తక్షణమే ఖాళీ స్థలంలోని పిచ్చి చెట్లు, ముళ్ల పొదల్లో ఉన్న మహనీయుల విగ్రహాలను శనివారం తొలగించి ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతానికి అక్కడి నుంచి తెచ్చి పెట్టారు. వారంలోగా పాఠశాల ప్రాంగణంలో విగ్రహాల ఏర్పాటుకు దిమ్మలు నిర్మించి తక్షణమే విగ్రహాలు పునః ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేయడంతో ఎంఈఓ హుటాహుటిన విగ్రహాలను భద్రపరిచారు. అలాగే జమునా స్కూల్ పాఠశాల హెచ్‌ఎం రుక్కు నాయక్‌కు జాతినాయకుల విగ్రహాల పునః నిర్మాణం బాధ్యతలను అప్పగించినట్లు తెలుస్తోంది.

## 21,22 తేదీల్లో క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం



వివరాలు వెల్లడిస్తున్న కోటేశ్వరరావు

యడ్లపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు సామినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ సామినేని కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సామినేని పానయ్య, నాగరత్నమ్మ స్మారకార్థం కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ హైదరాబాద్, బసవతారకం ఇండో – అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని బోయపాలెం శ్రీఅనంతలక్ష్మి స్పిన్నింగ్ మిల్లు ఆవరణలో ఈనెల 21, 22వ తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. అత్యాధునిక పరికరాలు కలిగిన మొబైల్ వాహనంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు వివరించారు. మామోగ్రఫీ, గర్భసంచికి స్కానింగ్, పాప్స్ మీయర్, ఊపిరితిత్తులకు ఎక్స్‌రే వంటి పరీక్షలు హైదరాబాద్ నుంచి నిపుణులైన వైద్యబృందం హాజరై నిర్వహిస్తారని పేర్కొన్నారు. శిబిరంలో వ్యాధి నిర్ధారణ అయిన వారికి, తెల్ల రేషన్ కార్డు ద్వారా హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌లో ఉచిత చికిత్స పొందే అవకాశం కల్పిస్తారని చెప్పారు. శిబిరానికి హాజరైన వారికి భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేసినట్లు మిల్లు ఎండీ సామినేని కోటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ వ్యాధినిర్ధారణ శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు టి.నాసరయ్య: 88865 19121, కె.సురేష్: 99121 17887లను సంప్రదించాలన్నారు.

## తీవ్ర వాగ్వాదం.. వ్యక్తికి కత్తిపోట్లు

శావల్యాపురం: వాటర్‌బాటిల్ కొనేందుకు పోటీపడిన ఇరువురు వ్యక్తుల మధ్య జరిగిన వాగ్వాదం కత్తిపోట్ల వరకు వెళ్లింది. ఈ సంఘటన మండల కేంద్రమైన శావల్యాపురంలో శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన ఊట్ల శ్రీనివాసరావు అనే వ్యక్తి ట్రావెల్స్ నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. శనివారం రాత్రి వినుకొండలో పనులు ముగించుకుని స్వగ్రామమైన శావల్యాపురం వెళుతూ ప్రభుత్వ వైద్యశాల వద్దనున్న దుకాణం వద్ద వాటర్‌బాటిల్ కోసం ఆగాడు. అదేసమయంలో చిన కంచర్ల గ్రామానికి చెందిన పూరేటి గణేష్ కూడా అక్కడ ఆగి వాటర్ బాటిల్ కావాలని దుకాణదారుడిని అడిగాడు. ఇద్దరూ నాకు ముందు కావాలంటే నాకు ముందు కావాలంటూ దుకాణదారుడిపై ఒత్తిడి తెచ్చారు. మాటామాటా పెరిగి గణేష్ పక్కనే ఉన్న ఉల్లిపాయల కత్తితో శ్రీనివాసరావును పొడిచి పరారయ్యాడు. గాయపడిన శ్రీనివాసరావును స్థానికులు వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. నిందితుడు ఆదివారం శావల్యాపురం పోలీసులకు లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### పోలేశమ్మకు బోనాలు

నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో కొలువైయున్న ఢిల్లీ పోలేశమ్మ తల్లి పొంగళ్లను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పెదకాపు యర్రగర్ల పోతురాజు, గ్రామ పెద్దలు అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు, వడపప్పు పానకం సమర్పించారు. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి గ్రామ మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయబద్ధ మేళతాళాలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు.